సాక్షి
కాకినాడ

బుధవారం । 26 । జూన్ । 2024



రూ.50 వేల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాయుడు రమణ మూర్తి మంగళవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.




ఆలస్యం.. అమృతం.. అద్భుతం!

మామిడి రకాలలో బంగినపల్లిది ప్రత్యేక స్థానం కాగా, గూడపల్లి బంగినపల్లి రకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

8లో

డెల్టాలకు 9,190 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,190 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,560, మధ్య డెల్టాకు 1,830, పశ్చిమ డెల్టాకు 4,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.80 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. ఇందులో డీఆర్‌డీఏ, సీపీఓ, మెప్మా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీఓలు, ఉపాధి శిక్షణ తదితర శాఖల అధికారులు ఉంటారని వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ – పీజీఆర్ఎస్)పై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ప్రతి సోమవారం జిల్లాలో పీజీఆర్ఎస్ సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. పీజీఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నమోదైన అర్జీల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహణకు ముందు ఆయా శాఖల వారీగా నమోదైన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సీపీఓ పి.త్రినాథ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, జిల్లా ఉపాధి శిక్షణ అధికారి జి.శ్రీనివాసరావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం ఎం.లావణ్య, కాకినాడ డీఎల్‌పీఓ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రికవరీలపై దృష్టి సారించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: జిల్లాలోని మహిళా సంఘాల రికవరీలపై సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి అన్నారు. జిల్లాలోని డీఆర్‌డీఏ సిబ్బందితో మంగళవారం స్థానిక టీటీడీసీలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో మూడు నెలలుగా మహిళా సంఘాల సభ్యులపై ఎటువంటి ఒత్తిడి తీసుకు రాకపోవడంతో బకాయిలు పెరిగిపోయాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతికి సంబంధించిన రికవరీలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మండల సంఘాల మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికవరీలు కూడా వేగంగా చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకో ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలన్నారు. లోకో దరఖాస్తులను ఆధార్‌తో ఆన్‌లైన్ చేయడం వలన ఒక వ్యక్తి మరో సంఘంలో ఉండే అవకాశం ఉండదని, దీని వలన బినామీ సభ్యుల బెడద తగ్గుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జూలై 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సభ్యురాలికి, ప్రతి సంఘానికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని చెప్పారు. వచ్చే నెల 15 నాటికి ప్రతి మహిళా సంఘం ఆడిట్ పూర్తి చేయాలని శ్రీరమణి ఆదేశించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, డీపీఎంలు, జిల్లాలోని 20 మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

బంగారు భవితకు బాటలు

- 40 రోజుల పాటు సాగిన దివ్యాంగుల సర్వే
- కొత్తగా 597 మంది గుర్తింపు
- ఇప్పటికే జిల్లాలో 2,180 మంది మానసిక, దివ్యాంగ చిన్నారులు
- వారికి సమగ్ర శిక్ష ద్వారా విద్యాబుద్ధులు
- ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలు
- తల్లిదండ్రుల్లో మానసిక ధైర్యం కల్పించేలా చర్యలు



గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అధికారులు

కాకినాడ సిటీ: మానసిక, శారీరక వైకల్యాలతో బాధపడుతున్న చిన్నారులకు ఆకట్టుకునే పద్ధతుల్లో విద్యను అందించేందుకు, తద్వారా వారిని సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు, ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి ద్వారా మానసిక, శారీరక దివ్యాంగ చిన్నారులను గుర్తించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలువురు చిన్నారులను వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల్లో చేర్పించారు. ఇంకా భవిత కేంద్రాలకు రాని చిన్నారులున్నారని అధికారులు గుర్తించారు.

తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి..

గత ఏడాది జూన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో పలువురు 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలలకు రాకుండా ఇంటి వద్దే ఉంటున్నారనే నిర్ధారణకు వచ్చారు. బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న తమ చిన్నారులను నలుగురిలోకి తీసుకుని వచ్చేందుకు తల్లిదండ్రులకు మానసిక ధైర్యం లేకపోవడమే దీనికి కారణమని గుర్తించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ప్రత్యేక అవసరాలు కలిగిన వారి పిల్లలను పాఠశాలలకు రప్పించే లక్ష్యంతో.. భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్లు (ఐఈఆర్‌పీ) మే ఒకటో తేదీ నుంచి సర్వే నిర్వహించారు. దీనికి ఆయా మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంల సాయం తీసుకున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీతో సర్వే పూర్తి కాగా, తాజాగా తుది వివరాలు ఓ కొలిక్కి వచ్చాయి. దీని ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 597 మంది మానసిక, శారీరక దివ్యాంగ చిన్నారులను ఐఈఆర్‌పీలు కొత్తగా గుర్తించారు. వీరందరినీ ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించారు. వీరికి సమగ్ర శిక్ష జిల్లా అధికారులు సహిత విద్య ద్వారా విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా, ప్రతి వారం ఫిజియోథెరపీ సేవలు అందించి, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోనున్నారు.

ప్రత్యేక అలవెన్సులు

జిల్లా వ్యాప్తంగా 21 భవిత కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఇప్పటికే 2,180 మంది మానసిక దివ్యాంగులు, బుద్ధిమాంద్యం కలిగిన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. వారిలో అవసరమైన వారికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపిస్టు ద్వారా ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులు అందజేస్తున్నారు. బడికి వచ్చే మానసిక దివ్యాంగులకు, బుద్ధిమాంద్యం ఉన్న వారికి, ఇంటి వద్ద ఉంటున్న వారికి, బాలికలకు ఈ అలవెన్సులు ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి రీడర్ అలవెన్సు కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు ఒకసారి రూ.2 వేలు అందజేస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్సు కింద రూ.200 ఇస్తున్నారు. గర్ల్ చైల్డ్ అలవెన్సు కింద బడికి రాకుండా ఇంటి వద్దే ఉంటున్న ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2 వేలు అందిస్తున్నారు. బడికి వెళ్లే వారికి పాఠశాలలో మిగిలిన అందరు విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, షూ, టై అందజేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న అమ్మ ఒడి పథకం కూడా వర్తింపజేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాలి. భవిత కేంద్రాల్లోని చిన్నారులకు ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించి, వారికి ఎటువంటి పరికరాలు అవసరమో గుర్తించేవారు. వారితో దరఖాస్తులు చేయించి, అవసరమైన పరికరాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

తల్లిదండ్రులను ప్రోత్సహించాలి



ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలను గుర్తించడంలో ఐఈఆర్‌పీలు సత్ఫలితాలు సాధించారు. జిల్లాలో కొత్తగా 597 మంది మానసిక దివ్యాంగ చిన్నారులను గుర్తించారు. వారందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు, బడులకు, కళాశాలలకు వెళ్లాల్సిన వారు. వారిని భవిత కేంద్రాలకు రప్పించి, విద్యాబుద్ధులు నేర్పించేలా చూడాలన్నది లక్ష్యం. వారి తల్లిదండ్రులను మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఇప్పటికీ వారిని బడికి పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. వారికి ధైర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– చామంతి నాగేశ్వరరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, కాకినాడ జిల్లా

కాకినాడ అర్బన్‌లో అత్యధికం

- సర్వేకు ముందు జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో ఇప్పటికే 2,180 మంది ప్రత్యేకవసరాలు కలిగిన పిల్లలు (మానసిక దివ్యాంగులు) ఉన్నారు. వీరిలో ఒక ఏడాది నుంచి 12 సంవత్సరాల లోపు బాలికలు 912 మంది, బాలురు 1,268 మంది ఉన్నారు.
- అత్యధికంగా కాకినాడ అర్బన్ మండలంలో 225 మంది ఉన్నారు.
- మండలాల వారీగా కాకినాడ రూరల్‌లో 197 మంది, సామర్లకోట 189, తుని 176, తొండంగి 169, పెద్దాపురం 135, కిర్లంపూడి 132, పిఠాపురం 127, కాజులూరు 118, కరప 116, తాళ్లరేవు 114, ఏలేశ్వరం 111, యు.కొత్తపల్లి 102, జగ్గంపేట 97, రౌతులపూడి 95, శంఖవరం 90, కోటనందూరు 87, గొల్లప్రోలు 83, ప్రత్తిపాడు 77, పెదపూడి 75, గండేపల్లిలో 54 మంది చొప్పున ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఇప్పటికే ఉన్నారు.

టెట్‌లో 8వ ర్యాంకు



వీర మణికంఠేశ్వరి

కోటనందూరు: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) ఫలితాల్లో కోటనందూరుకు చెందిన కుప్పా వీర మణికంఠేశ్వరి 150కి 142 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి సాధారణ ఆటో డ్రైవర్. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని కావడమే తన లక్ష్యమని మణికంఠేశ్వరి ఈ సందర్భంగా చెప్పింది. ఆమెను తల్లిదండ్రులు అభినందించారు.

మీడియాపై ఆంక్షలతో ప్రజాస్వామ్యానికి విఘాతం



చింతా అనూరాధ

సాక్షి, అమలాపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మీడియాపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని మాజీ ఎంపీ చింతా అనూరాధ విమర్శించారు. 'సాక్షి'తో ఆమె మంగళవారం మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత 'సాక్షి'తో పాటు పలు మీడియా చానల్స్ ప్రసారాలను నిలిపివేసేలా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు పొందిన మీడియాకు స్వేచ్ఛ ఇవ్వాలని, కోర్టు తీర్పు నేపథ్యంలో 'సాక్షి'తో పాటు ఇతర మీడియా చానల్స్ ప్రసారాలను తక్షణం పునరుద్ధరించాలని అనూరాధ డిమాండ్ చేశారు.

28న జాబ్‌మేళా

రావులపాలెం: స్థానిక సంహిత డిగ్రీ కళాశాల వద్ద రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోక్‌మాన్ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాకు బీటెక్, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 82476 45389 సెల్ నంబర్ సంప్రదించాలని కోరారు.

సీతారాములకు ప్రత్యేక ఆసనం

- అపచారాన్ని గుర్తించి, సరి చేసిన పండితులు
- యథావిధిగా సత్యదేవుని నిత్య కల్యాణం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరిపై ప్రతి రోజూ నిర్వహిస్తున్న సత్యదేవుని నిత్య కల్యాణంలో జరుగుతున్న అపచారాన్ని గుర్తించిన పండితులు దానిని వెంటనే సరి చేశారు. ఇప్పటి వరకూ స్వామివారి నిత్య కల్యాణంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఉంచుతున్న సింహాసనం పైనే అమ్మవారికి దిగువన.. పెళ్లిపెద్దలైన రత్నగిరి క్షేత్ర పాలకులు సీతారాములను ఉంచి ఈ క్రతువు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారిపై వేస్తున్న తలంబ్రాలు దిగువన ఉన్న సీతారాముల మూర్తులపై కూడా పడుతున్నాయి. దీనిపై భక్తుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇది అపచారమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై 'సత్యదేవుని నిత్యకల్యాణంలో అపచారం' శీర్షికన 'సాక్షి' మంగళవారం సంచికలో కథనం ప్రచురించింది. ఈ కథనం దేవస్థానంలో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు కూడా ఆరా తీశారు. యూట్యూబ్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతూండటంతో అందులో కూడా నిత్య కల్యాణంలో జరుగుతున్న అపచారం వెల్లడైంది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన నిత్య కల్యాణంలో సత్యదేవుడు, అమ్మవారిని యథాతథంగా వెండి సింహాసనం మీద వేంచేయించారు. ఆ పక్కనే సీతారాములకు ప్రత్యేకంగా మరో ఆసనం వేశారు. ఈ మార్పుపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, సత్యదేవుని నిత్యకల్యాణంలో రూ.1,116 టికెట్టుతో 13 జంటలు పాల్గొన్నాయి.



నిత్యకల్యాణంలో సత్యదేవుడు, అమ్మవారి సింహాసనం పక్కన మరో ఆసనంపై ఉంచిన సీతారాముల మూర్తులు

సమగ్ర ప్రణాళికతో సాగుకు సిద్ధం కావాలి

- కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశం
- ఖరీఫ్‌పై అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: సమగ్ర ప్రణాళికతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ కార్యకలాపాలు, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ, ఖరీఫ్‌లో జిల్లా రైతులు 97,543 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు సాగు చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సొసైటీలు, రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తనాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మార్కెట్‌లో అమ్ముతున్న విత్తనాలు, ఎరువుల నమూనాలు సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే కౌలు కార్డులున్న వారికి పునరుద్ధరణ, కొత్త కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం, జీవ రసాయన ఎరువుల తయారీ, వినియోగంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు సకాలంలో నాట్లు వేసేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

హార్టికల్చర్ శాఖ ద్వారా జిల్లాలో కోకో, ఆయిల్‌పామ్, మామిడి, కొబ్బరి, ఇతర పండ్ల మొక్కల పెంపకం లక్ష్యం, ఆయా మండలాల్లో రైతుల గుర్తింపు, ఒక్కో పంటకు ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ వంటి అంశాలపై కూడా షాన్ మోహన్ సమీక్షించారు. ఏపీఎంఐపీ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌కు రూ.15 వేల ఖర్చుతో 90 శాతం సబ్సిడీపై యూనిట్లు అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2,180 ఎకరాల్లో సెరికల్చర్ జరుగుతోందని, పట్టు గుడ్లు తీసేందుకు 400 షెడ్లు ఉన్నాయని తెలిపారు. ఒక్కో షెడ్డుకు రూ.12 లక్షలతో యూనిట్ మంజూరు చేస్తారన్నారు. ఈ ఏడాది మల్బరీ సాగును ప్రోత్సహిస్తామని చెప్పారు.

పశు సంవర్ధక శాఖ పరిధిలో వెటర్నరీ పాలీ క్లినిక్‌లు, వెటర్నరీ ఆస్పత్రుల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకూ కూడా కలెక్టర్ షాన్ మోహన్ సమీక్షించారు. పశువులకు రోగ నిరోధక టీకాలు, దాణా తదితర అంశాలపై సమీక్షించారు. పశు బీమా పథకం, పశు సంచార ఆరోగ్య సేవా కేంద్రాలు, యానిమల్ ఫీడింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాశరావు, ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ, సెరికల్చర్, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

నిధులిలా.. నీరు పారేదెలా?

- డెల్టా, ఏలేరు కాలువల మరమ్మతులకు సొమ్ము
- ఉమ్మడి జిల్లాల్లో 306 పనుల గుర్తింపు
- రూ.20.78 కోట్లు మాత్రమే కేటాయింపు
- డెల్టాకు 8.85 కోట్లు
- ఏలేశ్వరానికి రూ.99.73 లక్షలు
- ధవళేశ్వరం హెడ్ వర్క్స్‌కు రూ.2.05 కోట్లు
- అత్యధిక నిధులు గుర్రపుడెక్క తొలగింపునకే..
- కొత్త ప్రభుత్వంపై రైతులు, ఇరిగేషన్ అధికారుల భారీ ఆశలు
- కొద్దిగా డబ్బు విదిల్చి సరిపెట్టిన ప్రభుత్వం



కరప మండలంలో పూడుకుపోయిన జెడ్.భావారం డ్రెయిన్



అమలాపురం మండలం బండారులంక వద్ద పూడుకుపోయిన ఎగుక కౌశిక

సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి డెల్టాతో పాటు ఏలేరు ప్రాజెక్టు పరిధిలోని వరి, ఇతర వ్యవసాయ పంటలకు సంబంధించిన పంట కాలువలు, మురుగునీటి కాలువల్లో నీరు పారేందుకు వీలుగా చేపట్టే పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో సింహ భాగం గుర్రపుడెక్క తొలగింపునకే వినియోగించనున్నారు. అయితే కేటాయింపులు తక్కువగా ఉన్నందున కాలువల్లో పూర్తి స్థాయిలో పూడిక తొలగింపు పనులు జరిగే అవకాశం లేదని ఆయకట్టు రైతులు పెదవి విరుస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రాంతంతో సంబంధం లేకుండా ఖరీఫ్ సాగులో నీటి పారుదలకు కాలువల వ్యవస్థ ప్రధాన అవరోధంగా మారింది. ముఖ్యంగా గోదావరి డెల్టాతో పాటు ఏలేరు ప్రాజెక్టు పరిధిలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో గోదావరి డెల్టాలో సుమారు 5.30 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఏలేరు ప్రాజెక్టు పరిధిలో 50 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారని అంచనా. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోతున్న కారణంగా పంట కాలువలు, మురుగునీటి కాలువలు పూడుకుపోతున్నాయి. పంట కాలువలు, వాటికి అనుబంధంగా ఉన్న చానళ్లు, పంట బోదెల ద్వారా చేలకు నీరు అందడం లేదు. ప్రధానంగా తూర్పు డెల్టా పరిధిలోని కరప, తాళ్లరేవు, కె.గంగవరం, కాజులూరు, సామర్లకోట వంటి మండలాలు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ శివారు ప్రాంతాల్లోని మెరక చేలకు నీరు అందకపోవడానికి ఇదే ప్రధాన కారణం. మైనర్, మీడియం డ్రెయిన్లు, రెవెన్యూ, మేజర్ డ్రెయిన్లు సహితం పూడుకు పోవడంతో భారీ వర్షాలు, తుపానుల సమయంలో వరి చేల నుంచి ముంపు నీరు దిగడం లేదు. ఈ కారణంగా వేలాది ఎకరాల్లో వరి చేలు ముంపు బారిన పడి, రైతులు కోట్ల రూపాయల్లో నష్టపోతున్నారు.

నిధుల మంజూరు ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖరీఫ్ సాగులో అవాంతరం లేకుండా చేపట్టే పనులకు ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో 306 పనులు గుర్తించి, రూ.20.78 కోట్లు కేటాయించారు. దీనిలో పంట కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 102 పనులకు గాను రూ.4,69,84,000 కేటాయించగా, మధ్య డెల్టాలో 80 పనులకు రూ.3,89,34,000 ఇచ్చారు. ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో 11 పనులకు రూ.99.73 లక్షలు మంజూరు చేశారు. డ్రెయిన్స్ విభాగంలో కాకినాడ డ్రెయిన్స్ విభాగానికి 99 పనులకుగాను రూ.9,14,17,000 మంజూరు చేశారు. ఇక ధవళేశ్వరం హెడ్‌వర్క్స్‌కు 11 పనులకు రూ.2,05,85,000 మంజూరు చేశారు.

అరకొర కేటాయింపులు

ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో పంట కాలువల మూసివేత (క్లోజర్) సమయంలో చేయాల్సిన పనులకు అనుమతి రావడం ఆలస్యమైంది. అయినప్పటికీ అధికారులు జిల్లాలో అత్యవసరంగా 430 పనులు చేయాలని గుర్తించారు. ఈ పనులకు రూ.32.85 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించారు. అయితే 306 పనులకు రూ.20.78 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల వల్ల కాలువల్లో అరకొర పనులు మాత్రమే చేయాల్సి వస్తోందని, దీనివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని ఆయకట్టు రైతులు పెదవి విరుస్తున్నారు.

ఏటా తప్పని తిప్పలు

గోదావరి డెల్టా, ఏలేరు ప్రాజెక్టుల పరిధిలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ఏటా చేపట్టాల్సిందే. దీనికి రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకూ నిధులు కేటాయిస్తున్నారు. అయినప్పటికీ మళ్లీ తూడు, గుర్రపుడెక్క యథావిధిగా వచ్చేస్తున్నాయి. ఏటా ఖరీఫ్ సాగు ఆరంభంలోను, తిరిగి రబీ సాగు ఆరంభంలోనూ వీటిని తొలగించడం ఆనవాయితీగా మారింది. దీనికి ప్రధాన కారణం డెల్టా, ఏలేరు భౌగోళిక పరిస్థితులతో పాటు, వీటి పెరుగుదలకు వాతావరణం అనుకూలంగా మారడమే. వరి చేలల్లో ఇతర పంటల్లో వాడే యూరియాలోని నైట్రేట్లు, ఇతర రసాయనాల్లోని మూలకాలు పూర్తిగా కరగడం లేదు. వీటి వల్ల చేల నుంచి సారవంతమైన నీరు డ్రెయిన్లలోకి వస్తోంది. ఇది గుర్రపు డెక్క, తూడు వేగంగా పెరగడానికి కారణమవుతోంది. వీటి మూలాలను పూర్తిగా నిర్మూలించడం లేదు. కాలువల్లో వీటిని తొలగిస్తున్నా అవశేషాలను వదిలేస్తున్నారు. కాలువలో సగం తీయడం, మిగిలింది వదిలేయడం చేస్తున్నారు. తొలగించిన వాటిని కూడా గట్ల మీద వదిలేయడం వల్ల వేరు వ్యవస్థ తిరిగి కాలువలోకి చేరి ఇవి పెరగడానికి కారణమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో డ్రోన్ల ద్వారా కలుపు మందు పిచికారీ చేయించి, కొంతవరకూ గుర్రపుడెక్క నిర్మూలనకు కృషి చేసిన విషయం తెలిసిందే.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ



సఖినేటిపల్లి నుంచి కాట్రేనికోన మండలం వరకూ 2011 నుంచి డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. దానిని పూర్తి స్థాయిలో ఆధునీకరించలేదు. తక్షణం ఆధునీకరించాలని ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా కలెక్టర్‌ను కోరాం. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తుందనే ఆశ పెట్టుకుని రైతులు ప్రభుత్వాన్ని గెలిపించారనే విషయాన్ని మరవకూడదు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించకుంటే రైతులు తొలి పంటను ఎప్పటికీ సాగు చేయలేరు.

– యాళ్ల బ్రహ్మానందం, కోనసీమ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షుడు, బెండమూర్లంక, అల్లవరం మండలం

గుర్రపుడెక్క తొలగిస్తాం



ప్రభుత్వం కేటాయించిన నిధులలో అధికంగా డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగింపునకు వినియోగించనున్నాం. ముఖ్యమైన పనులు చేపట్టడం ద్వారా ముంపు సమస్యను పరిష్కరిస్తాం.

– కిషోర్, డీఈఈ, డ్రెయిన్స్, అమలాపురం

క్లుప్తంగా

ఛీటింగ్ కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

యానాం: నియోజకవర్గ పరిధిలో జరిగిన ఛీటింగ్ కేసుకు సంబంధించి మంగళవారం ఇద్దరిని దోషులుగా నిర్ధారించి, వారికి శిక్ష విధిస్తూ యానాం సబ్‌కోర్టు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.రాజామోహన్ తీర్పునిచ్చారు. వివరాలలోకి వెళితే తనను నమ్మించి రూ.30.30 లక్షలు కాజేశారని పట్టణ పరిధిలోని వికాస్‌నగర్‌కు చెందిన మహిళ యానాం పోలీస్‌స్టేషన్‌లో 2013, ఏప్రిల్ 3న ఫిర్యాదు చేశారు.. ఈ మేరకు కేసునమోదు చేసి సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. నిందితులుగా ఆకుల క్రాంతి, ఆకుల లక్ష్మిలపై కేసు నమోదుచేసి వారిపై 420, ఐపీసీ 341 ప్రకారం చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం ముద్దాయిలపై పెట్టిన కేసు నిరూపణ కావడంతో వారిద్దరికి రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గాశ్రీనివాస్ వాదించారు. హెడ్ కానిస్టేబుల్స్ నాగరాజు, పి.శ్రీనివాస్ కోర్టులో కీలక సాక్షులను ప్రవేశపెట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం- కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్ల మంగళవారం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతుడు గ్రీన్ రంగు టీ షర్ట్, నీలం రంగు ప్యాంట్, నీలం రంగు ఇన్నర్వేర్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఎడమ ఛాతిపై భవాని అనే పేరుతో పచ్చబొట్టు, కుడి చేతి మణికట్టు వద్ద శివుని బొమ్మ పచ్చబొట్టు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి గురించి ఏదైనా సమాచారం ఉంటే 94406 27551, 94914 44022, 08332442821. నంబర్లకు సమాచారం తెలియజేయాలన్నారు.

ఆలస్యం.. అమృతం.. అద్భుతం!

- బంగినపల్లి... కేర్ ఆఫ్ గూడపల్లి..
- సీజన్ చివరిలో కాపు వచ్చినా తగ్గని డిమాండ్
- ఇక్కడి నేల వల్లే దీనికి రుచి
- ఈ ఏడాది మెరుగ్గా దిగుబడి


గూడపల్లిలో చెట్టు నుంచి దిగిన బంగినపల్లి మామిడి పండ్లు

మలికిపురం: ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మామిడి పండ్ల రకాలలో బంగినపల్లి ఒకటి. తెలుగింట పుట్టి ప్రపంచ దేశాలలో అనేకమందికి నోరూరిస్తున్న ఈ పండు ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొంటూ ఈ మేరకు చెన్నైలోని జీఐ రిజిస్ట్రీ ఏపీ గుప్తా గతంలో నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దీని శాస్త్రీయ నామం బెనిషాన్. మొత్తం మామిడి సాగులో 70 శాతం బంగినపల్లి ఉంటుందని అంటారు. అటువంటి బంగినపల్లి మామిడి పండ్లకు ప్రసిద్ధి మలికిపురం మండలంలోని గూడపల్లి. వాటి సీజన్ వచ్చిందంటే మామిడి ప్రియులు నోట్లో రసాలే ఊరతాయి! మామిడి సీజన్ చివరి రోజుల్లో గూడపల్లి కేంద్రంగా సాగు అయ్యే బంగినపల్లి మామిడి దిగుబడి వస్తుంది. సీజన్‌లో బంగినపల్లి మామిడి పండ్లను తినాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. మామిడి రకాలలో ప్రత్యేక స్థానం బంగినపల్లి రకానిది. అయితే అనాదిగా గూడపల్లి బంగినపల్లి రకానికి మార్కెట్‌లో ప్రత్యేక స్థానం ఉంది. రాజోలు దీవిలోని పలు గ్రామాలలో ఎర్రని ఇసుక నేలల ఉండడం వల్ల ఇక్కడ బంగినపల్లికి అద్భుతమైన రుచి వస్తుందని పూర్వీకులు అంటారు. దీంతో దీనికి ధర కూడా ఎక్కువ. దీన్ని ఆసరా చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి బంగినపల్లి మామిడి కాయలను సైతం ఇక్కడికి తెచ్చి గూడపల్లి బంగినపల్లి మామిడిగా కూడా నమ్మించి వ్యాపారం చేస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. పూర్వం నుంచి కూడా బంగినపల్లి మామిడి పండ్లకు గూడపల్లి ప్రసిద్ధి. ఇక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా మామిడి ఉత్పత్తులు పెరుగుతున్నప్పటికీ కోనసీమ జిల్లాలోని గూడపల్లి మామిడి పండ్ల ధరలు మాత్రం ఏమాత్రం తగ్గవు. గూడపల్లితో పాటు గుబ్బలపాలెం, పల్లిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, కరవాక, గొల్లపాలెం, పడమటిపాలెం, శంకరగుప్తం, చింతలమోరి, కేశవదాసుపాలెం, బట్టేలంక, ఇరుసుమండ, అడవిపాలెం, లక్కవరం, కత్తిమండ, మోరిపోడు, వి.వి.మెరక తదితర గ్రామాలు మామిడి తోటలకు ప్రసిద్ధి. వాతావరణ మార్పుల రీత్యా రాజోలు దీవిలో మామిడి చెట్లు ఆలస్యంగా కాపునకు వస్తాయి. ఏప్రిల్ నెలలో పూతకు వస్తాయి. సీజన్ చివర జూన్‌లో దిగుబడి వస్తాయి. వర్షాలు పడే ముందు పూర్తి స్థాయి దిగుబడి రావడం ఇక్కడి మామిడి ప్రత్యేకత. ఇలా వర్షాలకు ముందు ఈ పండ్లు పక్వానికి రావడం వల్ల వర్షాల ధాటికి నష్టం కూడా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం బంగినపల్లి మామిడి పండ్లు రకం ధర పరక (13 కాయలు) పెద్దవి రూ.400 పైబడి ఉంది. చిన్నవి రూ.250 పైబడి ఉన్నాయి. రాజోలు దీవి నుంచి ఏటా సుమారు పది వేల టన్నుల బంగినపల్లి రకం బయట ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది.

అతిథి మర్యాదల్లో..

మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే ఇంటికి వచ్చిన చుట్టాలకు, స్నేహితులకు, ఇతర అతిథులకు వాటితో నోరు తీపి చేస్తూ ఉంటారు. భోజనం పెడితే విస్తర్లో మామిడి పండ్లు కూడా వడ్డించి మర్యాద చేస్తారు. ఇక ఈ సీజన్‌లో వివాహ భోజనాల విస్తర్లలో మామిడి ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఇక వియ్యాలవారికి, బంధువులకు, స్నేహితులకు బంగిన పల్లి మామిడి పండ్లను కానుకగా పంపించి ఆనంద పడతారు. మొహమాటపెట్టి మరీ తినిపించడం కోనసీమ జిల్లా ప్రజల ప్రత్యేకత కదా... మామిడి పండ్లను కూడా అతిథులకు అలానే తినిపిస్తారు.

బండి వచ్చిందంటే గూడపల్లి మామిడా అని అడుగుతారు

గూడపల్లి నుంచి హైదరాబాద్, ముంబయ్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఈ పండ్లు ఎగుమతి అవుతాయి. ఆయా ప్రాంతాలలో మామిడి పండ్ల లారీ మార్కెట్‌లోకి వెళ్లిందంటే అక్కడి హోల్ సేల్ డీలర్లు గూడపల్లి మామిడి కాయలా అని అడిగి మరీ కొంటారంటే వీటి డిమాండ్ అర్థం అవుతుంది. అంతలా బంగినపల్లి మామిడి గూడపల్లి పేరును తన బ్రాండ్‌గా మార్చుకుంది.

29న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో పెండింగ్‌లోవున్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని జిల్లావ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు కేసు వివరాలతో పాటు తమ సమ్మతిని ఇవ్వవచ్చన్నారు.

సుప్రీంకోర్టులో కేసులను పరిష్కరించుకోండి

సుప్రీంకోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకునే దిశగా జులై 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రకాశ్‌బాబు తెలిపారు. న్యాయవాదులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ప్రత్యేక లోక్ అదాలత్‌కు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం కక్షిదారులు, వారి న్యాయవాదులు టోల్ ఫ్రీ నంబర్ 15100కు, సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.

విగ్రహం తొలగింపులో రాజకీయం లేదు

కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి


విలేకరులతో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి

పెరవలి: పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన కూరగాయల మార్కెట్‌లో వేంకటేశ్వర స్వామి విగ్రహం ధ్వంసం అయిన ఘటనలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని, ఏ పార్టీలూ ఇందుకు కారణం కాదని కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి తెలిపారు. పెరవలి పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 10వ తేదీన అదే గ్రామానికి చెందిన ఆనందం వీర గణపతి, కూపరెడ్డి పెదకాపు, కొలూరి ఉమామహేశ్వరరావు కలసి వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. అందుకు గ్రామ వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరందరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ క్రమంలోనే కూరగాయల మార్కెట్ కమిటీకి, విగ్రహం ఏర్పాటు చేసిన వారికి రెండు దఫాలు చర్చలు జరిగాయని కానీ ఫలించలేదన్నారు. మరోసారి అందరం కూర్చుని సమస్యకు పరిష్కారం చేసుకుందామని వారు నిర్ణయించుకున్నారన్నారు. కానీ ఈ నెల 23వ తేదీన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించి, మరోచోట పెట్టే క్రమంలో విగ్రహంలో కొంత భాగం ధ్వంసం అయినట్లు తెలిపారు. దీనికి కారణమైన వారిని త్వరలో పట్టుకుంటామని వివరించారు. విగ్రహం తొలగించాలనుకుంటే కమిటీ, అధికారులకు, గ్రామ పెద్దలకు చెప్పి తొలగించాలని, ఇలా చేయటం తప్పేనని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని త్వరలోనే కమిటీ, విగ్రహం పెట్టిన వారితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని చెప్పారు. అంత వరకు గ్రామంలో పోలీసుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. నిడదవోలు సీఐ వి.జానకిరామయ్య, పెరవలి ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి, ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనం ఎమర్జెన్సీ



మాట్లాడుతున్న సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలనకు నిదర్శనంగా ఎమర్జెన్సీ నిలుస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు ధ్వజమెత్తారు. మంగళవారం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జేఎన్ రోడ్ జేకె గార్డెన్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తన అధికారాన్ని నిలుపుకోవడానికి ఎలాంటి రాజ్యాంగ విరుద్ధమైన పద్ధతులైనా అవలంబిస్తుందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నిరంకుశత్వం 1975లో ఎమర్జెన్సీ సమయం దేశంలో ప్రతి ఒక్కరూ చూశారన్నారు. కాంగ్రెస్ దాని భాగస్వాముల కుట్రలు 1975 లోనే కాకుండా ప్రస్తుతం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. రాజ్యాంగ విధానాలపై గౌరవం లేకుండా ప్రవర్తించడం కాంగ్రెస్ పార్టీ నైజమని, కాంగ్రెస్ కుటిల రాజకీయాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 1971 ఎన్నికల్లో అవినీతి వ్యవహారాలు వలన ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నిక రద్దు చేసిందన్నారు. ఆ సమయంలో అధికారం చేజారనివ్వకుండా ఉండడం కోసం ఇందిరాగాంధీ జూన్ 25 1975న రాష్ట్రపతితో బలవంతంగా సంతకం చేయించి ఎమర్జెన్సీని విధించిన నిరంకుశత్వం కలిగిన ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీనారాయణ , జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వంతో కాలాన్ని పరుగులెట్టించిన కవి గోపి


సాహిత్య సదస్సులో మాట్లాడుతున్న శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

అమలాపురం టౌన్: నానీల సృష్టికర్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్.గోపి తన కవిత్వంతో కాలాన్ని పరుగులెట్టించారని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. ఆచార్య గోపి 75వ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన సాహిత్య సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా లవకుశ చిత్రంలోని కుశుడు పాత్రధారి ఉయ్యూరు నాగ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. సదస్సులో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున, కడలి సత్యనారాయణ, ముత్యాల శరత్ బాబు, దొడ్డి సత్యవేణి, గ్రంథాలయాధికారి జీవీఆర్ ఎస్‌హెచ్‌కే వర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన రమణ

గోకవరం: గోకవరం శివారున మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కామరాజుపేటకు చెందిన చంద్రు రమణ(29) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం అతని స్నేహితుడు బుర్రె భద్రంతో కలిసి బైక్‌పై దేవీపట్నం మండలంలో పోశమ్మగండి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తపల్లికి వెళ్లే మార్గంలో గోకవరం శివారున మలుపులో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బైక్‌తో సహా కింద పడిపోయారు. ప్రమాదంలో రమణ మృతి చెందగా భద్రానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ఎస్సై కె.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటళ్లపై పౌర సరఫరా అధికారుల దాడులు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని పలు హోటళ్లపై ఎంఎస్‌ఓ కీర్తి ఆధ్వర్యంలో పౌర సరఫరాల విభాగం అధికారులు దాడులు చేశారు. ప్రతి హోటల్‌లోను గృహావసర వంట గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో మంగళవారం అధికారులు ఈ దాడులు చేశారు. ఐదు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. గృహావసర సిలిండర్ల నుంచి వ్యాపార సిలిండర్లకు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న సంస్థలను తనిఖీ చేసినట్టు ఎంఎస్‌ఓ తెలిపారు. ఆయా హోటళ్ల యజమానుల నుంచి సిలిండర్లను స్వాధీనం చేసుకుని వారిపై 6 ఎ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. సిలిండర్ల భద్రత నిమిత్తం స్థానిక పవన్‌కుమార్ గ్యాస్ ఏజెన్సీకి తరలించామన్నారు.

దాడి కేసులో జరిమానా

జగ్గంపేట: గేదెలు కాసే వ్యక్తిపై కర్రతో దాడి చేసిన రైతుకు పెద్దాపురం న్యాయస్థానం రూ.6 వేలు జరిమానా విధించింది. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాండ్రేగులకు చెందిన తోట కూర కాటయ్య తన పొలానికి గేదెలను మేపేందుకు తోలుకుని వెళ్లాడు. ఆ గేదెలు తన పొలంలో మేశాయంటూ కాటయ్యపై సరిహద్దు రైతు వర్రే సూరిబాబు కర్రతో దాడి చేశాడు. సూరిబాబుకు పెద్దాపురం కోర్టు న్యాయమూర్తి జి.హర్షవర్ధన్ రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

నాగపట్టణంలో డెంగీ కేసు


నాగపట్టణంలో క్లోరినేషన్ చేయిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది

కాట్రేనికోన: స్థానిక సచివాలయం-4 పరిధి నాగపట్టణంలో మంగళవారం డెంగీ కేసు నమోదైంది. నాగపట్టణానికి చెందిన గాడి పుత్రయ్య హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొన్ని రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. మందులు వాడినా జ్వరం తగ్గక పోవడంతో ఈనెల 21న సొంతూరుకి వచ్చాడు. ఈ నెల 24న కాట్రేనికోన పీహెచ్‌సీకి వెళ్లిన పుత్రయ్యకు వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలను తీసుకుని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. డెంగీ పరీక్షల్లో పాజిటివ్ రావడంతో అప్రమత్తమైన అధికారులు క్లోరినేషన్ చేయించేందుకు చర్యలు చేపట్టారు. సర్పంచి గంటి వెంకట సుధాకర్ ఆదేశాలతో కార్యదర్శి శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది పర్యవేక్షణలో నాగపట్టణంలో క్లోరినేషన్‌తో పాటు, దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేయించారు.

క్రికెట్ ఆడుతూ రాక్ సిరామిక్స్ కార్మికుల నిరసన


క్రికెట్ ఆడుతున్న కార్మికులు

సామర్లకోట: ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించబడిన కార్మికులు సంస్థ గేటు ఎదుట క్రికెట్ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆ కార్మికులు ఆకలికి ఆగలేక క్రికెట్ ఆడుతూ నిరసన తెలిపారన్నారు. వారిని తొలగించి మంగళవారం నాటికి 71 రోజులు అయ్యిందన్నారు. వారి స్థానంలో ఒడిషా, బీహార్, గుజరాత్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకు వచ్చి ఉపాధి కల్పిస్తున్న సమయంలో వారికి ఏ విధంగా జీతాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు ఈ కార్మికులకు జరిగిన అన్యాయంపై దృష్టి పెట్టాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించక పోతే సీఐటీయూ ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా ఆందోళన చేస్తామని కార్మికులు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, చంద్రన్న, సతీష్, ప్రభుదాసు, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, రాజబాబు, సతీష్‌కుమార్, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు పురోభివృద్ధికి 'కృషి'


ప్రచురణలను విడుదల చేస్తున్న డాక్టర్ గౌతమ్, శేషుమాధవ్, షేక్‌ఎన్‌మీరా, జానకిరామయ్య తదితరులు

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యూఎస్ గౌతమ్
- ఘనంగా కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక సమీక్షా సదస్సు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతు పురోభివృద్ధి దిశగా కృషివిజ్ఞాన కేంద్రాలు పనిచేయాలని అధిపతులను న్యూఢిల్లీ ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యూఎస్ గౌతమ్ కోరారు. ఐసీఏఆర్-సీటీఆర్‌ఐ, ఐసీఏఆర్ అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(అటారి), వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ పరిశోధనా సంస్థ (అటారి)జోన్ 10 కృషి విజ్ఞాన కేంద్రాల మూడురోజుల వార్షిక సమీక్ష సదస్సు మంగళవారం ప్రారంభమైంది. స్థానిక సీటీఆర్‌ఐ సమావేశ మందిరంలో ఇది ఆరంభమైంది. డాక్టర్ ఎస్.గౌతమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన సిటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ ఐ సీఏఆర్-సీటీఆర్‌ఐ(ఎన్‌ఐఆర్‌సీఏ) ఆధ్వర్యంలో రెండు కృషి విజ్ఞాన కేంద్రాలు రైతు సేవలో పనిచేస్తున్నాయన్నారు. వ్యవసాయాన్ని వాణిజ్య పరంగా చూడగలిగితే రైతు ఆదాయంలో స్థిరత్వం వస్తుందన్నారు. హైదరాబాద్ అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ యస్ మీరా మాట్లాడుతూ కృషివిజ్ఞాన కేంద్రాల సమీక్షా సమావేశాలు రాజమహేంద్రవరంలోని సీటీఆర్‌ఐలో జరుపుకోవడం హర్షదాయకమన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పోటీతత్వంతో పనిచేయాలని, రైతులకు వ్యవసాయం, ఉద్యాన పంటలు, పశు విజ్ఞానం, గృహ విజ్ఞానం తదితర అంశాలపై నిరంతర అవగాహన కల్పించడంలో ప్రథమ పాత్రను పోషిస్తున్నాయని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్శిటి వైస్ చాన్సలర్ డాక్టర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ భారత దేశంలో కేవీకేలు రైతు అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వరి, కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, పండ్లు మొదలైన పంటలపై వినూత్నమైన పరిశోధనలు జరుపుతూ, రైతుకు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు.

శ్రీ కొండా లక్ష్మయ్య తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చానల్సర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణలో రైతు సాధికారత, పురోభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రాలు దోహద పడుతున్నాయని తెలిపారు. పెదవేగి ఐసీఏఆర్ అండ్ ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ విభాగాల ద్వారా పరిశోధన ఫలితాలు రైతుకు నేరుగా అందించడంలో ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయని తెలిపారు. సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ ఇ.కరుణశ్రీ, ఐసీఏఆర్ అండ్ నారమ్ డాక్టర్ సెంథిల్ వినాయగం, కర్ణాటక తంకూర్ కేవీకే హెడ్ డాక్టర్ ఝెన్. లొగానందన్, ఐసీఏఆర్-ఐఐఓపీఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్, తమిళనాడు నామక్కల్ కేవీకే హెడ్ డాక్టర్ కె.వేలు మురుగన్, అటారి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.భాస్కరన్ వక్తలుగా వ్యవహరించి కేవీకేలు.. రైతులు, మహిళలు, గ్రామీణ యువత, గిరిజనులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై విశదీకరించారు. అనంతరం పలు ప్రచురణలను ముఖ్య, విశిష్ట అతిథుల చేతుల మీదుగా విడుదల చేశారు. అటారి జోన్‌కు అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించి 72 కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

యువతను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించేలా యత్నం

పెద్ద ఎత్తున యువతను వ్యవసాయ రంగం వైపు మళ్లించేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి కసరత్తు చేస్తున్నట్లు ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యూఎస్ గౌతమ్ చెప్పారు. ఇప్పటికే వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులతో లాభదాయకంగా వ్యవసాయ రంగం ఉండడంతో సాఫ్ట్ వేర్ నిపుణులు, గ్రాడ్యుయేట్స్ కూడా వ్యవసాయ రంగంవైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి పరిధిగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) జోన్ 10 వార్షిక జోనల్ సమీక్ష వర్క్‌షాప్ స్థానిక సీటీఆర్‌ఐలో మంగళవారం ఉదయం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వర్క్ షాప్‌నకు హాజరైన గౌతమ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇంకా ఎక్కువ మంది యువతను వ్యవసాయ రంగంవైపు ఆకర్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దేశంలో 731కేవీకేలు ఉన్నాయని, వీటికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆధారం చేసుకుని వీటి ద్వారా ఎప్పటికప్పుడు నూతన పరిశోధనలు, మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, మేలైన వంగడాలు అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. దేశంలోని మూడు జోన్స్‌లో దాదాపు ఎనిమిది వేల హెక్టార్లలో ప్రయోగాత్మకంగా 300డ్రోన్ ఉపయోగించి పురుగుమందులు జల్లడం వంటి పనులకు సంబంధించి ప్రదర్శన ఇచ్చినట్టు గౌతమ్ చెప్పారు. దీనివల్ల కార్మికుల చార్జీలు తగ్గడం, కాలం సద్వినియోగం అవ్వడం, మిగిలిన వ్యవసాయ ఖర్చులు కూడా తగ్గి మరింత లాభదాయకంగా వ్యవసాయం ఉంటుందని అన్నారు. 10వేల బయో రిసోర్స్ యూనిట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాలు పెరిగిన నేపథ్యంలో అదనపు కేవీకేలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొత్తం మీద నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడే తమ లక్ష్యమని గౌతమ్ వెల్లడించారు.